క్లుప్తంగా

సెయింట్ ఆన్స్‌లో దీపావళి సంబరాలు



ఫిరంగిపురం: మండలం కేంద్రంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. రంగురంగుల ముగ్గులు వేసి జ్యోతులు వెలిగించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం సిస్టర్ నిర్మల మేరీ మాట్లాడుతూ చీకటిని పారదోలి వెలుగును ప్రసాదించేది దీపావళి అని చెప్పారు. అనంతరం టపాసులు కాల్చి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాల నివారణకు కృషి

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రావణ్‌బాబు



ఫిరంగిపురం: మాతా శిశు మరణాలు తగ్గించేందుకు ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రావణ్‌బాబు అన్నారు. మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఢిల్లీకి చెందిన ఆర్మన్ సంస్థ ఆధ్వర్యంలో సమీకృత అధిక ప్రమాద గర్భధారణ నిర్వహణ నియమాలపై ఆరోగ్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌బాబు మాట్లాడుతూ గర్భిణుల్లో ప్రమాదాలు ఏ విధంగా గుర్తించాలి? ఏ లక్షణాలు ఉంటే ఎలాంటి పరీక్షలు నిర్వహించాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎత్తు, బరువు, రక్తశాతం యూరిన్ ఆల్బమ్, షుగర్ పరీక్షలు చేసి వాటిని సంబంధిత ఎంసీపీ కార్డులో రికార్డు చేయాలన్నారు. అనంతరం ఆర్మాన్ సంస్థకు చెందిన డాక్టర్ చరణ్ శర్వాణి, శివప్రసాద్, ప్రశాంతిలు పలు అంశాలపై ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. మందపాడు, పెదకాకాని, మేడికొండూరు, నుదురుపాడు, ఫిరంగిపురం ఆరోగ్య కేంద్రాల ఆరోగ్య సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం



మేడికొండూరు: మండల పరిధిలోని విశదల గ్రామ సమీపంలోని ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాస్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రక్తదానం వల్ల ప్రయోజనాలు వివరించారు. ప్రమాదంలో ఉన్న వ్యక్తికి సరైన సమయంలో రక్తం అందక అనేకమంది ప్రాణాలు పోతున్నాయన్నారు. ఆరోగ్యకరమైన విద్యార్థి రక్తదానం చేయాలన్నారు. శిబిరంలో 72 యూనిట్ల రక్తాన్ని సేకరించి వెల్ఫేర్ బ్లడ్ బ్యాంక్‌కు అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. రక్తదాన శిబిరం నిర్వహించడం పట్ల కళాశాల సెక్రటరీ రాజేంద్ర ప్రసాద్ విద్యార్థులను అభినందించారు.

ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్ఐకు సత్కారం



నగరంపాలెం: తుళ్లూరు ట్రాఫిక్ విభాగం ఏఎస్ఐ పి.విఠలేశ్వరరావు బుధవారం ఉద్యోగ విరమణ పొందగా, జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని హాల్‌లో ఆయన్ను సత్కరించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ పోలీస్ శాఖకు అందించిన సేవలు మరువలేమని, ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని అన్నారు. జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి(పరిపాలన), హనుమంతు(ఏఆర్), ఏఆర్ డీఎస్పీ శాంతకుమార్, ఆర్ఐ శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

శానిటరీ మేస్త్రీకి సన్మానం



తెనాలిఅర్బన్: స్థానిక పురపాలక సంఘ పరిధిలో శానిటరీ మేస్త్రీగా పనిచేస్తు గురువారం పదవీ విరమణ చేయనున్న ఏలేష్‌ను అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి, సిబ్బంది సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. తెనాలి బుధవారం జరిగిన కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నజీర్, పలువురు శానిటరీ సెక్రెటరీలు, వర్కర్స్ పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధం!

- నుదురుపాడులో శిథిలావస్థలో పశు వైద్యశాల
- కొద్దిపాటి వర్షం పడినా కారుతున్న గదులు
- పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న శ్లాబ్
- భయపెడుతున్న విషసర్పాల సంచారం



పశు వైద్యశాల

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలో పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరడంతో పలు గ్రామాలు రైతులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఏళ్ల కిందట నిర్మించిన భవనం కావడంతో పైకప్పు పూర్తిగా దెబ్బతింది. దీంతో చిన్న వర్షానికే గదుల్లోకి నీరు వచ్చి కారిపోతున్నాయి. గదుల్లోని కింద భాగాల్లో ఎలుకలు తవ్వడంతో మట్టి లేచి అసౌకర్యంగా ఉంటుంది. పాములు సైతం సంచరిస్తున్నాయని సిబ్బంది చెబుతున్నారు.

1984లో నిర్మాణం..

1968లో గ్రామానికి చెందిన కోటయ్య ఏడు సెంట్ల స్థలాన్ని పశు వైద్యశాల నిర్మాణం కోసం కేటాయించారు. గ్రామంలో పెద్దలు కమిటీగా ఏర్పడి దాతల సహకారంతో 1984లో భవనాన్ని నిర్మించారు. ఇప్పటికే 37 ఏళ్ల కావడంతో భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గోడలు నెర్రలిచ్చాయి. లోపల ఉన్న గోడలపై మొక్కలు మొలిచి వేర్లు బయటకు వచ్చి వేలాడుతున్నాయి. వైద్యశాల పరిధిలో నుదురుపాడుతో పాటు కండ్రిక, మునగపాడు, మేరికపూడి, పొనుగుపాడు, గుండాలపాడు, ఎర్రగుంట్లపాడు, వేమవరం, బేతపూడి గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాలలో గేదెలు, ఎద్దులు, ఆవులు మొత్తం సుమారుగా 8వేల పైచిలుకు ఉన్నాయి. జీవాలు మరో 7 వేల వరకు ఉన్నాయి. వాటికి వైద్యసేవలకు, చూడి పరీక్షలు చేయాలన్నా ఇక్కడికే రావలసి ఉంది. ఇక్కడ పశు వైద్యాధికారితో పాటు అసిస్టెంట్ ఉన్నారు. గ్రామాల్లో పనిచేసే సిబ్బంది పనుల కోసం ఇక్కడికి వస్తుంటారు.

భయంభయంగా విధులు..

వైద్యశాలలో గోడలతో పాటు నేలంతా కూడా పగుళ్లిచ్చి ఎలుకలు, తేళ్లు, పాములు సంచరిస్తూ ఉండడంతో సిబ్బంది బెంబేలెత్తిపోతున్నారు. కుర్చీ కింద కాళ్లు పెట్టి కూర్చోవాలంటే భయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందులు ఉంచే గదుల్లో కూడా పాములు తిరుగుతూ ఉండడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏ కొద్దిపాటి వర్షం పడిన పెచ్చులూడి మీద పడుతుండడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. పుస్తకాలు, మందులు, పూర్తిగా తడిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు పైకప్పు పెచ్చులు మీద పడతాయోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. వైద్యశాలలో ఉంచిన మందులను కూడా ఎలుకలు పాడు చేస్తున్నాయి. పాడి రైతులకు మందులు అందజేయాలంటే ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు.

వసతులు కరువు...

వైద్యశాలలో పశువులు కట్టేసేందుకు వీలుగా ఏర్పాటు చేసిన బోనులు రెండు విరిగిపోవడంతో పశువులను వాటిలో ఉంచి పరీక్షలు చేయాలంటే ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. చెట్లకు కట్టి పశువులకు పరీక్షలు చేయాల్సి వస్తుందని చెబుతున్నారు. ఎప్పుడైనా సమావేశాలు నిర్వహించే సమయంలో ఇక్కడికి వచ్చే మహిళాసిబ్బంది కాలకృత్యాలకు వెళ్లాలన్నా మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణం కోసం కృషి చేయాలని గ్రామస్తులు రైతులు కోరుతున్నారు.

భవనం శిథిలావస్థకు చేరింది..



భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. దీనిపై గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము.

– పీర్ అహమ్మద్, పశువైద్యాధికారి



నెర్రెలిచ్చిన గది



తడిచిపోతున్న పుస్తకాలు, మందులు

తగిన జాగ్రత్తలతో టపాసులు కాల్చాలి



తాడేపల్లిరూరల్: దీపావళి టపాసులు కాల్చేటప్పుడు ప్రమాదాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటూ పండుగను జరుపుకోవాలని ఎంటీఎంసీ పరిధిలోని అంబేడ్కర్ కాలనీ (డ్రైవర్స్ కాలనీ) అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ మానస అన్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని టపాసులు కాల్చే సమయంలో జరిగే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆమె వివరించారు. దీపావళి టపాసులు కాల్చే సమయంలో చిన్న చిన్న తప్పిదాలు జీవితాన్ని చీకటిగా మార్చే ప్రమాదం ఉందని, టపాసులలో కంటికి హానికరమైన రసాయనాలు ఉంటాయని, కంటిలో కాకర్స్ నలుసులు పడినప్పుడు వంటిని చల్లని నీటితో శుభ్రపరచుకోవాలని సూచించారు. ప్రమాదవశాత్తు చేతులు, శరీరం కాలినప్పుడు కాలిన ప్రదేశంలో చల్లని నీటితో కడిగి వెన్న, ఐస్ వంటివి పెట్టకుండా కొబ్బరినూనె రాయాలని, బొబ్బలను చిదిపితే ఇన్‌ఫెక్షన్ ఎక్కువ అవుతుందని తెలియజేశారు. బాణాసంచా కాల్చేటప్పుడు పట్టు, నైలాన్ వస్త్రాలు ధరించకుండా వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని అన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు

కొలకలూరు(తెనాలి): బీజేపీ ఆర్టీ సెల్ జిల్లా కన్వీనర్ కాలిశెట్టి రమేష్‌బాబు సతీమణి నళీమా ఏడో వర్ధంతి సందర్భంగా బుధవారం పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈవోపీఆర్ అండ్ ఆర్డీ వైవీడీ ప్రసాద్ చేతులమీదుగా వస్త్రదానం చేశారు. పంచాయతీ కార్యదర్శి జి.ప్రసాద్, కాలిశెట్టి హరీష్ నాయుడు, బండి చంద్రమోహన్, యడాలి రాంబాబు, నవనీతం సాయి, ముత్తే వీరరాఘవయ్య, కొచ్చెర్ల శ్రీనివాసరావు, కొలకలూరి దుర్గారావు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలను సదా స్మరించుకోవాలి

తుళ్లూరులో పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన



తుళ్లూరులో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐలు వెంకటేశ్వర్లు, అంజయ్య, ఎస్ఐలు, సిబ్బంది

తాడికొండ: నాటి పోలీసు అమరుల త్యాగమే నేటి మన సురక్షిత జీవనానికి ప్రతిఫలం అని, వారి త్యాగాలను నిత్యం స్మరించుకోవాలని తుళ్లూరు సీఐలు గంగా వెంకటేశ్వర్లు, అంజయ్య అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని తుళ్లూరు లైబ్రరీ కూడలిలో అమరవీరులకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా ధైర్య సాహసాలు ప్రదర్శించి అమరులైన పోలీసులను స్మరించుకొనేందుకు అమరవీరుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎస్ఐలు అంకమ్మ, బాబురావు, ఏఎస్ఐ శ్రీనివాస్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్



తాడేపల్లిరూరల్: తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కత్తుల పేటలో వున్న శ్మశాన వాటికలో కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బంది బుధవారం జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. శ్మశాన వాటికలో ఐదు, ఆరు అడుగుల ఎత్తులో చెట్లు పెరిగిపోయాయి. దీనిపై పలువురు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో కమిషనర్ అలీమ్‌బాషా ఆదేశాల మేరకు జంగిల్ క్లియరెన్స్ చేసినట్లు శానిటేషన్ సిబ్బంది తెలిపారు.

పశువైద్య శిబిరం

బండారుపల్లి(తాడికొండ): తాడికొండ మండలం బండారుపల్లి గ్రామంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరానికి పశు పోషకుల నుంచి మంచిస్పందన లభించింది. ఈ శిబిరంలో గ్రామంలోని 52 పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మినరల్ మిక్సర్, మందులు పంపిణీ చేశారు. అనంతరం 31 దూడలకు నట్టల నివారణా మందు, 15 పశువులకు డీ టిక్కింగ్ చేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ డి.బాల శంకరరావు, వైద్యాధికారిణి డాక్టర్ సౌజన్య, డాక్టర్ఆర్.రవితేజ, పశు వైద్య సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ హిత దీపావళిపై అవగాహన ర్యాలీ



స్కిట్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తెనాలి: దీపావళి పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవాలనే సంకల్పంతో స్థానిక వెస్ట్‌బెర్రీ పాఠశాల విద్యార్థులు బుధవారం పట్టణంలో అవగాహన ర్యాలీ చేశారు. పట్టణ ఆర్టీసీ బస్‌స్టేషను నుంచి చినరావూరు పార్కు వరకు జరిగిన ర్యాలీలో పాల్గొన్న 250 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, 'పటాసులు వద్దు–పర్యావరణాన్ని కాపాడుదాం' అన్న నినాదాలు చేశారు. పర్యావరణ హితంగా జరుపుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేసే ఫ్లెక్సీతోపాటు ప్లకార్డులను ధరించారు. కూడలి ప్రదేశాల్లో స్కిట్ల రూపంలో పటాసులు కాల్చడం వలన కలిగే ఆరోగ్య సమస్యలు, వాయు కాలుష్యం, ధ్వని కాలుష్యం వంటి ప్రభావాలను వివరించారు. దీపావళిని పర్యావరణానికి హాని కలగకుండా సేంద్రియ దీపాలు, పూలదీపాలు వెలిగిస్తూ, సంప్రదాయపూర్వక పద్ధతుల్లో జరుపుకోవాలనే సూచనలు అందించారు. వెస్ట్‌బెర్రీ పాఠశాల ప్రిన్సిపాల్ టీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, 'మనం పండుగను జరుపుకోవడం ఎంతగానో అవసరం, అయితే పర్యావరణానికి హాని కలిగించకుండా జరుపుకోవడమనే బాధ్యత మనందరిపైన ఉందని ఈ సందర్భంగా చెప్పారు. పర్యావరణ హిత దీపావళికి విశేష ఆదరణను సొంతం చేసుకొని, విద్యార్థులు, ఉపాధ్యాయుల సామూహిక కృషికి ఉదాహరణగా నిలిచిందన్నారు. కో–ఆర్డినేటర్స్ భానుప్రియ, శశికళ, మృత్యుంజయ పర్యవేక్షించారు.

వక్ఫ్ పరిరక్షణ మహాసభను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ సుభాని

తాడేపల్లిరూరల్: ముస్లిం సమాజానికి నష్టం తెచ్చే కొత్త వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నిర్వహించనున్న మహాసభను జయప్రదం చేయాలని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకులు షేక్ సుభాని పిలుపునిచ్చారు. బుధవారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకున్న 2024 సవరణ బిల్లులో రాజ్యాంగ వ్యతిరేక అంశాలు ఉన్నాయని, ఈ బిల్లు కలెక్టరుకు అథారిటీ ఇవ్వాలనుకోవడం సరికాదని, వక్ఫ్ భూములకు ప్రత్యేకంగా ఉన్న వక్ఫ్ ట్రిబ్యునల్‌ను బలహీన పరిచేలా సవరణ బిల్లు ఉందని, ఈ బిల్లు వస్తే ముస్లిం సమాజం తీవ్రంగా ఇబ్బందులు పడుతుందని అన్నారు. కొత్త వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ విజయవాడ కుమ్మరిపాలెంలో నవంబర్ 3వ తేదీన జమాతే ఇస్లామీ హింద్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరగనున్న వక్ఫ్ పరిరక్షణ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. మైనార్టీ నేతలు షేక్ జాని సాహెబ్, షేక్ రషీద్ సాహెబ్ పాల్గొన్నారు.

ఏసీసీ కార్మికులకు సీఐటీయూ మద్దతు



కార్మికుల పోరాటానికి మద్దతు తెలుపుతున్న సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు వై.నేతాజీ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలోని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని రాష్ట్ర కమిటీ సభ్యుడు వై. నేతాజీ అన్నారు. బుధవారం ఏసీసీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు రావలసిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నష్టపరిహారం చెల్లించకుండా కార్మిక నాయకులను అక్రమంగా పదే పదే పోలీసులు అరెస్టులు చేయడం సరికాదని, సుదీర్ఘ కాలం పాటు పోరాడుతున్న ఏసీసీ కార్మికుల పోరాటానికి సీఐటీయూ పూర్తి మద్దతు ఇస్తోందన్నారు. సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ కార్మికులందరు ఐక్యంగా నిలబడి పోరాడాలన్నారు. యూనియన్ కార్యదర్శి కూరపాటి స్టీఫెన్ మరో ఏడుగురిపై అక్రమంగా కేసులు బనాయించడం సరికాదని అన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు, నాయకులు కూరపాటి స్టీఫెన్, బి.సూర్యప్రకాష్, ఆశీర్వాదం, సుబ్బారావు, రమాదేవి, బి.అంకయ్య, ఎస్‌కే ఇమాంబీ, నారమ్మ, శివకుమారి, యు.రమణ, కిరణ్, కృష్ణ, సాంబశివరావు, నవనీతం, బి.ప్రభాకర్ పాల్గొన్నారు.



తాడేపల్లిలో వర్షం తాకిడికి ఒరిగిన బాణసంచా దుకాణాల టెంట్లు



టపాసులపై పట్టలు కప్పుకుంటున్న వ్యాపారులు



ఉండవల్లి సెంటర్‌లో లోతట్టు ప్రాంతాల్లోకి చేరిన వర్షపు నీరు

భారీవర్షం.. జనజీవనం అస్తవ్యస్తం

- రెండు గంటలు ఏకధాటిగా వర్షం
- టపాసుల వ్యాపారులకు తీరని నష్టం
- లోతట్టు ప్రాంతాల్లోకి చేరిన వర్షపునీరు



తాడికొండ మెయిన్ రోడ్డు జోరువాన

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోను, దుగ్గిరాల మండలంలోను బుధవారం మధ్యాహ్నం అకాల వర్షం కురవడంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. రెండు గంటలపాటు వర్షం పడడంతో టపాసుల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉండవల్లి దేవాలయ భూముల్లోను, తాడేపల్లి రూరల్ ప్రాంతంలో 35 షాపుల వరకు ఏర్పాటు చేశారు. మంగళగిరి పట్టణ రూరల్‌లో మరో 50 షాపులు, దుగ్గిరాల మండలంలో పలు గ్రామాల్లో 10 షాపుల వరకు అధికారిక లెక్కల ప్రకారం ఏర్పాటు చేశారు. భారీగా వర్షం కురవడంతో ఏర్పాటు చేసుకున్న టెంట్లు ఒరిగిపోయి వర్షం టపాసుల మీద పడడంతో షాపులు ఏర్పాటు చేసుకున్నవారు హడావిడిగా టార్పాలిన్ పట్టలను టపాసులపై కప్పారు. ఉండవల్లి దేవాలయ భూమిలో ఏర్పాటు చేసిన టపాసుల షాపులు లోతట్టు ప్రాంతంలో ఉండడంతో ఆ ప్రాంతమంతా జలమయమై బురదమయంగా తయారవడంతో ఇలాంటి పరిస్థితుల్లో వ్యాపారం ఏలా చేయాలో అర్థం కావడం లేదని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం..

ఒక్కసారిగా వర్షం పడడంతో నియోజకవర్గ వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, రోడ్లపై వర్షపు నీరు, మురుగునీరు వచ్చిచేరింది. ప్రధాన రహదారుల్లో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ చిన్న చిన్న బజారుల్లో డ్రైనేజీ నీళ్లలోకి వర్షపు నీరు చేరి మురుగునీరు రోడ్లపైకి చేరడంతో రోడ్లన్నీ అపరిశుభ్రంగా తయారయ్యాయి. ఇళ్లలో నుంచి రోడ్ల మీదకు రావాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెల్లక్వారీ, ఎర్ర క్వారీ ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపునీరు వచ్చి చేరి ఆయా ప్రాంతాలు బురదమయం అయ్యాయి. తాడేపల్లి జాతీయ రహదారి వెంబడి మణిపాల్ అండర్‌పాస్, విజయవాడ నుంచి గుంటూరు వెళ్లే మార్గంలో సర్వీస్ రోడ్డులో, పాత టోల్‌గేటు వద్ద వర్షపు నీరు వచ్చి చేరడంతో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రోడ్డు మార్జిన్ దిగిన లారీ దిగబడిపోయింది. దుగ్గిరాల గ్రామ పరిధిలో పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దుగ్గిరాల తెనాలి రోడ్డు గోతుల మయం కావడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. వాతావరణ శాఖ సూచనలు లేకుండా వర్షాలు రావడంతో జనజీవనం స్తంభించిపోయింది.

తాడికొండలో వర్షం..

తాడికొండ: అల్పపీడన ద్రోణి ప్రభావంతో బుధవారం సాయంత్రం తాడికొండలో వర్షం కురిసింది. గత నెల రోజులుగా వదలకుండా కురుస్తున్న వర్షాలు ఇటీవల ఓ నాలుగు రోజుల పాటు విశ్రమించాయనుకున్న అన్నదాతలు ఇప్పుడిప్పుడే తమ పంట పొలాలను అంతర సేద్యం, కలుపు నివారణ, మందుల పిచికారీ చేసుకుంటున్నారు. మళ్ళీ వాతావరణంలో మార్పులు రావడంతో ఉన్నట్టుండి చల్లబడి బుధవారం సాయంత్రం నుంచి వర్షాలు కురుస్తుండటంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'చలపతి'లో వర్క్‌షాప్ ప్రారంభం



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మోతడక(తాడికొండ): మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐఈటీసీ స్టూడెంట్స్ ఫోరం ఫర్ ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో బుధవారం రెండు రోజుల వర్క్‌షాప్ ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ కొల్లా నాగ శ్రీనివాసరావు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన సిలికాన్ టెక్నో సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్, సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో మెడికల్ మాన్యుఫాక్చరింగ్ ఇండస్ట్రీ, ఇతర రంగాలలో ఇమేజ్ ప్రాసెసింగ్ అప్లికేషన్స్‌లో మ్యాథ్స్ ల్యాబ్ ప్రోగ్రామింగ్ ద్వారా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల మినీ ప్రాజెక్టుల రూపొందించి ప్రదర్శించడం జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇమేజ్ ప్రాసెసింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిళితం చేసి అద్భుత ఫలితాలు సృష్టించవచ్చన్నారు. ఆ దిశగా విద్యార్థులు ప్రయత్నించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ రవికిరణ్ డీన్‌లు డాక్టర్ బాల మురళీ కృష్ణ, డాక్టర్ ఫణికుమార్, డాక్టర్ సుబ్బారావు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.